# విషాద వెన్నెల నిషాదం

ఆర్. దమయంతి



**మ్యూజింగ్:** విషాద వెన్నెల నిషాదం

**రచన:** ఆర్. దమయంతి

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: జనవరి 2015

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=4660

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# విషాద వెన్నెల నిషాదం

[Aaj Jaane Ki Zid Na Karo](https://www.youtube.com/watch?v=wqbbILfdw94)
https://www.youtube.com/watch?v=wqbbILfdw94

Farida Khanum

చీకటి గది నిండా దివుల పూలు. వుండుండి.. నీలి విషాద మిళిత గుభాళింపులు. గాలి గుబుల ఊసులకి తనూ వూగతూ దర్వాజా పరదాలు.

తనకి మరణం వుంటుందని తెలీదూ? అయితేనేం? –యవ్వనాల మల్లి నవ్వుతూ విరియనంటుందా?

విడిపోతున్నానని తెలిసీ, అనార్కలి తుది శ్వాస వరకు పేరుపెట్టి పిలవకుందా!!

చీకట్లోనే మెరుస్తానంటుంది నక్షత్రం. ఎంతకీ నీ రూపమే మోస్తానంటుంది నయనం.

ఎన్ని కన్నీళ్ళు తాగిన అద్దం ఈ హృదయం.

తీక్షణ వీక్షణాలన్నీ ఇప్పుడు క్షణంక్షణం బేల కన్యలైపోయాయి. ఎడబాటునిక ఏ మాత్రం ఓపనన్నాయి వలపు బాధలు.

★★★

నిశ్చల కాలం – రెక్క లార్చుకుని వాలింది, సందె వేళ గుమ్మంలో.

వలపువన్నె సారంగ దారాలు – గుమ్మాలనూగు రంగుపూల నీడలు.

ఓడిపోయిన ఒంటిరెక్క మందారం.. పిట్ట గోడమీద కనిపిస్తూ అర్ధ చంద్రాకారం.

– నీకై క్షణం క్షణం నా ఈ ప్రతీక్షణలు.. ఎవరికీ వినిపియని గుండె గానాలు.

గదిలో నీ పద ధ్వనులు మదిలో అత్తరొలికిన సుగంధ శోభలు

ఇక మొదలౌ నని తెలుసులే – విరజాజి చెండు పై వలపువానజల్లులు.

ఏడాదికొకటే వసంతం. నువ్వొస్తే, అది నా ముంగిటే నిరంతరం

★★★

ఎంతగా చెప్పాలనుకున్నాను? వస్తే చాలు. వెళ్తూ మాత్రం – ప్రాణాలను తోడుకుపోకు.

ఊహు. పెదవి కదలనిదే! నమ్మవ్ కానీ, నువ్ నాతో వున్నప్పుడు

ఈ గొంతు నీ స్వరమౌతుంది. నేను అనేదే వుండదు. అంతా నీదైపోతుంది..

★★★

ప్రేమికులు కోరుకునే చెరసాళ్ళు - ప్రియమయిన కౌగిళ్ళు. అవి – పారిపోను వీలు లేని స్వర్గాలు.

ఆ కాసిన్ని కొసరు క్షణాల కోసమే.. మరుగుతూ ఇన్ని యుగాలూ ఎదురుచూసానా!, అన్నట్టుండె

ఆత్రపు ఆరంభ సంబరాలలో.. నిన్నుస్వాగతించడానికే తప్ప, శాసించడానికెలా ఒప్పుతుంది మనసు?

అయినా సరె.. నన్ను నీతో చెప్పుకోనీ!.. నువు కదిలితే కదిలేది కాలం మాత్రమే అనుకోకు. నా లోని జీవం కూడా.

నువ్ కనిపించక విరహించేది - శరీరమే అని తలచకు. విలపించే హృదయమూ, ఇదేనని మరువకు.

★★★

దీపం తొలగనీయొద్దంటావ్ కానీ.. చీకటి కరుగుతుందనే నా భయాన్ని నువ్వెప్పుడు తీరుస్తావ్?

మరిక ఉంటానేం?.... అంటూ వీడ్కోలుకి సిద్ధమౌతున్న క్షణమల్లా

బలంగా అనిపిస్తుంది. – కదలని శిలైపొమ్మంటూ కాలాన్ని శపించాలని.

★★★

గడపదాటి పోయే నీ అడుగుల వెనకే పరుగులు . ఉసురు పోతూ నా గుండె చప్పుళ్ళూ!

ఖాళీ అయిపోతూ... దారి చివరి మలుపులు. శూన్యాన రగులు సెగలు ఎర్రనిప్పు నిట్టూర్పులు.

కాదనుకోలేని దుఃఖాలే శాశ్వతానందాలు.

తుదిలేని విషాద విందులే – ఈ కథాంతాలు.

కానీ, ఏంలే?

మళ్ళీ నువ్వొచ్చే చివరిక్షణపు కొసకల్లా

స్వప్న సౌధాలు నిర్మించుకోడమే నా వినోదాలు.

నే ప్రియమార లిఖించుకునే నూతన విరహ కావ్యాలు.

రాత్రి కలల దుప్పటి పై

నక్షత్రప్పూల నవ్వు నా సంతకం.

★★★

మరచిపోకు, ప్రియతమా!

నువ్వు రావడం కోసమే నే మిగిలి వుంటాను.

నీ కంటి మెరుపులలోనే జీవిస్తుంటాను.

వచ్చేయ్! ఈసారైనా, ఇక విడిచి పోనంటూ...

రాసిస్తూ – జన్మంతా. నా కళ్ళ ముందే వుంటానంటూ.

★

For Latest Telugu Books - Visit now:
Kinige
.com